ప్రజాశక్తి


సోమవారం 15 మే 2023 | 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



సన్ డే

- పెరిగిన వడగాల్పులు
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- పెరిగిన విద్యుత్ వినియోగం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో వడగాల్పులు తీవ్రరూపం దాల్చాయి. ఉదయం నుంచి ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో పగటి పూట బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ఆదివారం పల్నాడు జిల్లాలో గరిష్ఠంగా 47.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు జిల్లాలోని దాదాపు 22 మండలాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచాయి. ప్రజలు వేసవి తాపంతో అల్లాడుతున్నారు.

తుపాను ప్రభావం తగ్గిన తరువాత రెండు జిల్లాలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. పల్నాడు జిల్లాలో మాత్రం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోహిణీ కార్తెకు ముందే వడగాల్పులు, 47.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో రాబోయే పక్షం రోజుల్లో వీటి ప్రభావం మరింత పెరగవచ్చునని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఆదివారం నమోదు అయిన ఉష్ణోగ్రతల వివరాలిలా ఉన్నాయి. గురజాల, దుర్గి 47.5, దాచేపల్లి 47.2, అమరావతి 47, అచ్చంపేట 46, ఈపూరు 45.6, బెల్లంకొండ 44, పిడుగురాళ్ల 42, వెల్దుర్తి 42.4, రాజుపాలెం 41.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గుంటూరులో 41.4, తెనాలిలో 41.7, కొల్లిపర 41, తాడికొండ 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వడగాల్పులతో ఉక్కపోత పెరిగింది. పగటి పూట జనసంచారం తగ్గింది. మధ్యాహ్న సమయంలో వీధులన్నీ బోసిపోతున్నాయి. వేసవి తీవ్రతతో మళ్లీ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఉష్ణోగ్రతలు పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో అదనపు లోడ్ రిలీఫ్ పేరుతో గంట నుంచి రెండు గంటల పాటు అనధికారికకోత అమలు అవుతోంది. కొన్నిచోట్ల మరమ్మతుల పేరుతో నిలిపివేస్తున్నారు. వేడిగాలలు తీవ్రతకు పిల్లలు, వృద్దులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఏసీలు, కూలర్లు వినియోగించేవారు ఉదయం నుంచి నిరాటకంగా వినియోగించడం వల్ల విద్యుత్‌కు బాగా డిమాండ్ ఏర్పడింది. సగటున జిల్లాలో 20 శాతం విద్యుత్ వినియోగం పెరిగినట్టు జరిగినట్టు అధికారులు తెలిపారు. రానున్న మూడ్రోజుల పాటు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వడగాల్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. వడగాలి ఉదయం10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతోంది. ఎండ తీవ్రతతో చిరు వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుపక్కన వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులు కూడా ఎండ తీవ్రతకు అల్లాడుతున్నారు. వేసవి తీవ్రతతో శీతలపానియాల వ్యాపారం ఊపందుకుంది. సాయంత్రం ఐదు గంటల తరువాత బయటకు వచ్చిన ప్రజలు చల్లని పదార్థాలు, మజ్జిగ ప్యాకెట్లు, కొబ్బరిబొండాలకు ఆసక్తి చూపుతున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు. వెనక ముసుగుల్లో పట్టుబడిన నిందితుల్లో కొందరు..

పూజ పేరుతో లైంగిక దాడి

దిశ యాప్‌కు ఫిర్యాదుతో ఇద్దరు యువతుల్ని విడిపించిన పోలీసులు - నిందితులుగా 12 మంది అరెస్టు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

తాడికొండ మండలం పొన్నెకల్లు, చిలకలూరిపేట పండరీపురంలో ఇద్దరు యువతులపై లైంగిక దాడి కేసులో పోలీసులు 12 మందిని అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను నల్లపాడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో దక్షిణ మండలం డిఎస్‌పి ఎమ్‌డి.మహబూబ్‌బాష ఆదివారం వెల్లడించారు. దిశ యాప్ ద్వారా యువతులు ఇచ్చిన సమాచారం మేరకు నిందితుల నుంచి రక్షించి వారి ప్రాణాలను కాపాడమని ఆయన తెలిపారు. పూజల పేరుతో అధిక మొత్తంలో డబ్బు సంపాదించవచ్చని భ్రమపెట్టి యువతులను ట్రాప్ చేశారని, వారిపై లైంగిక దాడి చేయగా ఈ కేసును తాము 24 గంటల్లో చేధించి నిందితులను పట్టుకున్నామని తెలిపారు. ఇంకా కొంతమంది నిందితులున్నారని, వీరిపైనా దర్యాప్తుచేసి త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు.

తాడికొండ మండలముమ పొన్నెకల్లుకు చెందిన టాపీ మేస్త్రీ నాగేశ్వరరావు కొంత కాలంగా తాంత్రిక పూజలు చేస్తూ ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. బృంద సభ్యులైన అరవింద, రాధ, నాగేంద్రబాబు, భాస్కర్, వెంకట సురేష్, రవి మరికొంతమంది కలసి అమాయకులైన పేద యువతులను, మాయ మాటలు చెపి, మోసం చేసి, వారు ఒక గంట పూజలో కూర్చుంటే రూ.లక్షల్లో డబ్బులు ఇస్తాము అని ఆశ జూపి, ఇద్దరు యువతులను లోబర్చుకున్నారు. వారిని తొలుత పొన్నెకల్లు, తరువాత చిలకలూరిపేటలో పూజల్లో నగ్నంగా కూర్చొబెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ యువతులు పారిపోవడానికి ప్రయత్నించగా నిందితులందరూ, వారిని భయపెట్టి కదలనియకుండా అక్కడే కూర్చోబెట్టి, డబ్బులు కావాలంటే 2లో

నదిలో ఈతకు దిగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి



ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో నదిలో ఈత ద్వారా సేదదీరడానికని వచ్చిన ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. ఎన్‌టిఆర్ జిల్లా యనమలకుదురు, పటమటకు చెందిన ఏడుగురు యువకులు కలిసి ఆదివారం తాడేపల్లి సమీపంలోని పాతూరు వద్ద కృష్ణానదికి వచ్చారు. అందరూ కలిసి నదిలో దిగి ఈత వేస్తుండగా పటమట ప్రాంతానికి చెందిన బాలాజి, సాయితేజ ఉన్నట్టుండి గుంతల్లో పడి మునిగి గల్లంతయ్యారు. ఇది 2లో

జాప్యమేల?

- ఎంఇఒ కార్యాలయాల విభజనపై ఏడాదిగా తాత్సారం
- పనిభారంతో కదలని ఫైళ్లు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని విద్యార్థుల్లో దాదాపు సగం మంది గుంటూరు నగరంలోని పాఠశాలల్లోనే చదువుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఎక్కువ స్కూల్స్ ఇక్కడే ఉన్నాయి. ఆయా పాఠశాలల పర్యవేక్షణకు విద్యాశాఖ ఇద్దరు ఎంఇఒలను కేటాయించినా, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోకపోవటం లేవు.

ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని అర్బన్ మండలాలను విద్యాశాఖ విభజించి కొత్తగా ఎంఇఒ కార్యాలయాల ఏర్పాటుకు ఉత్తర్వులిచ్చి ఏడాదైనా గుంటూరులో మాత్రం అమలు కావట్లేదు. పెరిగిన జనాభాకు అనుగుణంగా తహశీల్దార్ కార్యాలయాలను విభజించి తూర్పు, పశ్చిమ మండలాలుగా విభజించిన విధంగా విద్యాశాఖ కూడా ఆ విధంగా విభజిస్తూ గతేడాది ఏప్రిల్‌లో ఉత్తర్వులిచ్చింది. కానీ ఇంత వరకూ గుంటూరులో కొత్త కార్యాలయాలు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికీ ఒకే కార్యాలయలంలో కొనసాగుతోంది. రెండు మండలాల బాధ్యతలు ఒకే అధికారికి అప్పగించారు. ఉత్తర్వులను అమలు చేయాల్సిన పై అధికారులు పూర్తి స్థాయిలో ఎందుకు చేయట్లేదని ఉపాధ్యాయులకు అంతుచిక్కట్లేదు.

గుంటూరు తూర్పు మండల పరిధిలో ప్రభుత్వ, మండల పరిషత్, మున్సిపల్, జెడ్పీ, ప్రైవేటు అన్ని రకాల మేనేజ్‌మెంట్ల పాఠశాలలు కలిపి 192 ఉన్నాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 229 పాఠశాలలున్నాయి. ఉన్న పాఠశాలల పర్యవేక్షణే కష్టంగా ఉన్న నేపథ్యంలో మున్సిపల్ పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించటంతో మరింత పనిభారం పెరిగింది. అయినా అధికారులు కొత్త ఎంఇఒ కార్యాలయాన్ని ఏర్పాటు చేయకుండా ఒక్క అధికారి, ఒక్క కార్యాలయంతోనే నెట్టుకొచ్చారు. దీంతో పాఠశాలలు, ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువై అధికారులకు పర్యవేక్షణ పెద్ద 2లో

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

వ్యవసాయ బావిలో దూకి మృతి 2లో

గ్రామీణ పేదలకు న్యాయం పట్ల అవగాహన కల్పించాలి

హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా


8 లో

సభనుద్దేశించి మాట్లాడుతున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

చదువుకొనలేరు.. సహకరించండి..

ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యంతో పల్నాడు కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి - నరసరావుపేట

పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినా ఆ తర్వాత చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థలు అవకాశం కల్పించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. ఈ మేరకు ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యంతో కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్పందన హాలులో కలెక్టర్ ఆదివారం సమావేశమయ్యారు. ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక స్తోమత లేని కారణంగా పదో తరగతితోనే చదువును ఆపేయాల్సి వస్తోందని చెప్పారు. ఎంతో మంచి భవిష్యత్ ఉన్న వారి చదువు కొనసాగడానికి సహకరించాలని కోరారు. ఇందుకు తమ సహకారం ఉంటుందని యాజమాన్యాలు హామీనిచ్చాయి. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ నిర్వహణ అధికారి సునీత, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్గొన్నారు.

జెడ్‌పి ఆదాయం పెంపునకు కృషి

టెన్తులో మెరుగైన ఫలితాలు : జడ్‌పి చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా 8 లో

ఆళ్ల నాగేశ్వరరావుకు 'సేవా రత్న' అవార్డు



ప్రజాశక్తి-తెనాలి

రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు కు చెందిన మనం ఫౌండేషన్ వారు పట్టణానికి చెందిన కవి రచయిత ఆళ్ళ నాగేశ్వరరావుకు రవీంద్రనాథ్ ఠాగూర్ సేవా రత్న పురస్కారాన్ని 2023 సంవత్సరానికి గాను తో ఆన్లైన్ ద్వారా అందజేశారు. సాహితీ రంగంలో విశేష సేవలందించిన వారికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. మనం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కె. చక్రవర్తి అవార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందించారన్నారు. ఈ సందర్భంగా ఆళ్ళ మరిన్ని పురస్కారాలను అందుకోవాలని డాక్టర్ చక్రవర్తి అభిప్రాయపడినట్లు తెలిపారు. రవీంద్రనాథ్ ఠాగూర్ పురస్కారాన్ని అందుకున్న ఆళ్ళను పట్టణానికి చెందిన పలువురు సాహితీవేత్తలు ,రచయితలు అభినందించారు.



వ్యవసాయ రైతు సమాఖ్య గోశాల ఏర్పాటు

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి -మండల పరిధిలోని నూతలగుంట వారి పాలెంలో సేంద్రీయ వ్యవసాయ రైతు సమాఖ్య గోశాల ఏర్పాటు చేయడం జరిగింది. కేంద్రీయ పశువర్ధక శాఖ నేషనల్ డైలీ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నాబార్డ్ మాజీ చైర్మన్ చింతల గోవిందరాజు వారి సతీమణి సుశీల ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఆవుల సంతతి అభివృద్ధి చేయడం ద్వారా సేంద్రీయ వ్యవసాయాన్ని కొనసాగించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎన్. సురేంద్రబాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు

'లబ్ధిదారులను మోసం చేస్తున్న ప్రభుత్వం'

ప్రజాశక్తి-నరసరావుపేట

టిడిపి హయాంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు సారథ్యంలో కేసానుపల్లి పంచాయతీ పరిధిలో 1504 టిడ్కో ఇల్లులు కట్టించామని, వైసీపీ నాయకులు వాటిని అర్హులకు కాకుండా ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఇవ్వాలని కుట్ర పన్నారని టిడిపి నాయకులు కడియం కోటి సుబ్బారావు, గుండాల సురేష్, మాబు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ టిడ్కో గృహాల మంజూరుకు నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి డాక్టర్ చదలవాడ అండగా ఉంటారన్నారు. అన్ని అర్హతలు ఉండి, రూ 50 వేలు డిడి కట్టిన వారికి టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయించామన్నారు. టిడ్కో గృహాలపై హైకోర్టు స్టే ఇచ్చిందన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రూ.50 వేలు కట్టిన అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇవ్వాలని స్టే లో ఉందని చెప్పారు. రూ 50 వేలలో సగం రూ 25 వేలు లబ్ధిదారులకు తిరిగి ఇచ్చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకువచ్చిందని, రూ 25 వేలు వెంటనే తిరిగి లబ్ధిదారులకు ఇచ్చేయాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అన్ని అర్హతలు ఉన్న ఇల్లు మంజూరు చేయకపోతే డిడి జిరాక్స్ తో టిడిపి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వైసిపి నాయకులు లబ్ధిదారుల అర్హతపై కొర్రీలు పెట్టి వయస్సు పెరిగిపోయిందని బ్యాంకులు లోన్లు ఇవ్వవని లబ్ధిదారులను అనర్హులను చేస్తున్నారని మండిపడ్డారు. ఐదళ్ల క్రితం మంజూరు చేయాల్సిన ఇళ్లను ఇవ్వకుండా ఇప్పుడు వయసు ఎక్కువ అనే సాకు చూపడం దుర్మార్గమన్నారు.లబ్ది దారుని కుటుంబ సభ్యుల్లో ఒకరి పేరు మీద రుణం ఇప్పించాలన్నారు. పాత అర్హులకు కాకుండా కొత్త వైసీపీ నాయకులకు టిడ్కో గృహాలను మంజూరు చేస్తే అధికారులపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని హెచ్చరించారు. జీఓ నెం.21 ద్వారా వైసిపి కార్యకర్తలకు టిడ్కో ఇల్లు ఇవ్వడానికి కుట్ర పన్నుతూ నిజమైన పేదల కడుపు కొడుతున్నారన్నారు. టిడిపి ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేసి లబ్ధిదారులకు అండగా ఉంటామన్నారు.

రాజధానిలో శరవేగంగా లే అవుట్ల అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన పేదలకు 'నవ రత్నాలు - పేదలందరికీ ఇళ్ళు పథకం'లో సెంటు స్థలం పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో నిడమర్రు, కృష్ణాయపాలెం, నవులూరు, ఐనవోలు, మందడం, కురగల్లు, యర్రబాలెం, పిచ్చుకలపాలెం, బోరుపాలెం, నెక్కల్లు, అనంతవరంలో లే అవుట్ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. అదివారమైనా అధికారులు వచ్చి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు సంబంధించి 1402.59 ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్, ప్లాట్లు చదును, 180 కిలోమీటర్ల మేర అంతర్గత గ్రావెల్ రహదార్లు నిర్మాణం, ఆవాసయోగ్యంగా ఇళ్ల స్థలాల మార్కింగ్ తదితర పనులు చకచకా సాగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాకు కేటాయించిన 583.93 ఎకరాల్లో 14 లే అవుట్లలో, గుంటూరు జిల్లాకు సంబంధించి 550.65 ఎకరాల్లో 11 లే అవుట్లలో పనులను వేగవంతం చేశారు. పనులను సిఆర్డిఎ కమిషనర్ వివేక్ యాదవ్ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన 50,004 మందికి సిఎం జగన్మోహన్రెడ్డి ద్వారా ఇళ్ల స్థలాలను పంపిణీ చేయనుండగా ఈ కార్యక్రమాన్ని 18వ తేదీన తుళ్లూరులో నిర్వహిస్తారని ప్రచారమవుతోంది.



లే అవుట్లలో పనులను పరిశీలిస్తున్న సిఆర్డిఎ కమిషనర్ వివేక్ యాదవ్

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెదకూరపాడు : స్థానిక ఆర్సిఎం పాఠశాల ప్రాంగణంలో కొమరాబత్తిన రోజమ్మ,కార్యం శెట్టి జయరావుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, యూనియన్ బ్యాంకు విశ్రాంత జనరల్ మేనేజర్ డాక్టర్ కె ఎల్ రాజు ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త సామినేని కోటేశ్వరరావు ప్రారంభించారు.

జాప్యమేల?

(మొదటి పేజీ తరువాయి)

సమస్యగా మారింది. ఉపాధ్యాయులకు సంబంధించిన ఫైళ్ల అనేకం నెలల తరబడి పెండింగ్లో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన కార్యాలయాలు ఏర్పాటు, సిబ్బంది కేటాయింపు చేపట్టాలని సంఘాలు కోరుతున్నాయి. ముఖ్యంగా ఉపాధ్యాయులకు మెడికల్ లీవులు, స్టడీ లీవులు, రిటైర్ అయిన వారికి బెన్ఫిట్స్ ఇవ్వటానికి పెద్ద ఎత్తున డబ్బులు అడుగుతున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు ఇచ్చిన వారికి ఒక చకచకా పనులు చేస్తూ, డబ్బులు ఇవ్వని వారి ఫైళ్ల మాత్రం నెలల తరబడి పెండింగ్లో ఉంచుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వీటన్నింటి దృష్ట్యా రెండు మండలాలకు వేర్వేరు కార్యాలయాలు, వేర్వేరుగా ఎంఇఒలను ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

నదిలో ఈతకు దిగి ఇద్దరు మృతి

(మొదటి పేజీ తరువాయి)

గమనించిన తోటివారు పెద్దగా అరుచుకుంటూ వడ్డుకు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న తాడేపల్లి పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. స్థానిక మత్స్యకారుల సాయంతో గాలింపు చేపట్టి మృతదేహాలను వెలికి తీయించారు. అనంతరం మృతుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - సత్తెనపల్లిరూరల్



అప్పుల బాధలు తాళలేక వ్యవసాయ బావిలో పడి కౌలురైతు ఆత్మహత్య చేసు కున్న ఘటన మండలంలోని గోరంట్లలో ఆదివారం జరిగింది. కుటుంబీకుల వివ రాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుర జాల ప్రసాదు (40) తన తండ్రి పేరు నున్న అరెకరం పొలంతోపాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసు కుని పత్తి, మిర్చి సాగు చేశాడు. వ్యవసాయలో ఒడిదుడుకులు కారణంగా నష్టాలు రావడంతో సుమారు రూ.10 లక్షల వరకు అప్పులయ్యాయి. వీటిని తీర్చే విషయంలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ప్రసాదు ఆదివారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని వెలుపలికి తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పూజ పేరుతో లైంగిక దాడి

(మొదటి పేజీ తరువాయి)

తాము చెప్పినట్లు చేయవలసిందే లేదంటే రూపాయి కూడా ఇచ్చేదిలేదని బెదిరించడంతోపాటు తీవ్ర పదాలతో దుర్భాషలాడారు. ఇద్దరు యువతులను చిలకలూరిపేట నుంచి పొన్నెకల్లుకు బలవంతంగా తీసుకు వెళుతున్న క్రమంలో వారు గోరంట్ల వద్ద దగ్గర అగిన సందర్భంలో ఒక యువతి దిశ కాల్ 112కు ఫోన్ చేయడతో నల్లపాడు పోలీసులు అక్కడకు వెళ్లి యువతులిద్దర్నీ కాపాడారు. యువతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పూజారి నాగేశ్వరరావు, అరవింద, రాధా, నాగేంద్ర బాబు, భాస్కర్, పెద్దిరెడ్డి, సాగర్, వెంకట సురేష్, శివ, సునీల్, పవన్, సుబ్బు అనే వ్యక్తులను ఆదివారం అరెస్టు చేశామని, వీరిని కోర్టులో హాజరుపరుస్తామని డిఎస్పి తెలిపారు. సిఐ బత్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జర్నలిస్టుల ఉచిత హెల్త్ క్యాంపు

- రెండు రోజుల జర్నలిస్టుల హెల్త్ క్యాంపునకు భారీ స్పందన
- ఉచితంగా రూ.10 వేల విలువైన 17 రకాల వైద్య పరీక్షలు



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ . తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖల సౌజన్యంతో విజయవాడలోని ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కాలేజ్ లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం మే 13, 14 తేదీల్లో నిర్వహించిన క్యాంపులో 1,200 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని అవసరమైన వైద్య సేవలు పొందారన్నారు. తొలిరోజు వైద్య పరీక్షలకు, రెండో రోజు వైద్యులచే కన్సల్టేషన్ కు భారీ ఎత్తున జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు హాజరై 22 ప్రముఖ ఆస్పత్రులకు చెందిన అనుభవజ్ఞులైన వైద్య బృందంచే వైద్య సేవలు పొందారని వెల్లడించారు. ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంలో మామోగ్రామ్, హృద్రోగ సంబంధిత టెస్ట్ లు, ఈసీజీ, 2డీఎకో, ట్రేడ్ మిల్ టెస్ట్ (టిఎంటీ), అల్ట్రా సౌండ్ స్కానింగ్, సీబీపీ, లివర్ పంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్, థైరాయిడ్, డయాబెటిక్ టెస్ట్ లు, ఎక్స్ రే, కళ్లు, డెంటల్ పరీక్షలు వంటి తదితర 17 రకాల వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ముందుగానే ఆరోగ్య సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవడం ద్వారా జర్నలిస్టులు మరింత మెరుగైన జీవితాన్ని కొనసాగించాలన్నదే తమ తపన అన్నారు. కుటుంబ సమస్యలు పక్కనబెట్టి, ఆరోగ్య సమస్యలు ఫణంగా పెట్టి సమాజహితం కోసం పనిచేసే జర్నలిస్టుల ఆరోగ్యాలు బాగుండాలని కమిషనర్ ఆకాంక్షించారు. హెల్త్ క్యాంపులో నిర్ధారిత పరీక్షలు చేసిన పిదప అత్యవసర వైద్య సేవలు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య సాయం పొందాల్సి వస్తే ఆరోగ్యశ్రీ అనుబంధిత ఆస్పత్రుల(రిఫరల్ హాస్పిటల్)కు వెళ్లడానికి జర్నలిస్ట్ హెల్త్ కార్డు తప్పనిసరి కనుక కొత్తగా అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులు హెల్త్ కార్డు పొందడానికి వీలైనంత త్వరగా రూ.1,250 చెల్లిస్తే, దీనికి ప్రభుత్వం తరపున మరో రూ.1,250 చెల్లిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి ఎం.టి కృష్ణబాబు రెండో రోజు కూడా హెల్త్ క్యాంపును సందర్శించారు. వైద్యులు అందిస్తున్న వైద్యసాయాన్ని స్వయంగా పరిశీలించారు. ఇంత పెద్ద ఎత్తున జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం తనకు సంతోషం కలిగించిందన్నారు. ఈ భారీ స్పందనతో భవిష్యత్ లో రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాల్లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని కష్ణబాబు తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంపును వినియోగించుకున్న జర్నలిస్టులు ఈ సందర్భంగా కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. క్యాంపులో నిరంతరాయంగా వైద్య సేవలందించిన ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్న 22 ఆస్పత్రుల యాజమాన్యాలు, సిబ్బందికి ప్రత్యేకంగా కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. రెండు రోజుల పాటు హెల్త్ క్యాంపులో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలందించిన 22 ఆస్పత్రుల యాజమాన్యానికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో హరీంద్ర ప్రసాద్ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు.

రైతు బజారులోని కిరాణా దుకాణం యజమానిపై దాడి

ప్రజాశక్తి-మంగళగిరి

నగరంలోని రైతు బజారు ఎస్టేట్ అధికారి రైతు బజారు లోని కిరాణా షాప్ యజమాని మాధవరావు, ఆయన కుమారులు సోమేశ్వరరావు, వెంకట సుబ్బారావు లపై దాడికి పాల్పడ్డాడు. సేకరించిన వివరాల మేరకు... నగరంలోని రైతు బజారులో గత దశాబ్ద కాలంగా వ్యాపారి మాధవరావు కిరాణా షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. ఈ క్రమంలో రైతు బజారు ఎస్టేట్ అధికారి జి. రమేష్, కిరాణా షాప్ యజమాని నెల మామూళ్లు ఇవ్వడం లేదనే అక్కసుతో వ్యక్తి గతంగా కక్ష్య పెంచుకున్నాడు. కిరాణా షాప్ వ్యాపారాన్ని దెబ్బ తీయాలని కుట్రతో రైతు బజారు ఆవరణలో దేవా అని వ్యక్తి చేత పప్పుల కొట్టు, అశోక్ అనే వ్యక్తి చేత నూనె కొట్టు తో పాటు మరో ముస్లిం వ్యక్తి చేత అల్లం, చిన్నుల్లి కొట్టును రమేష్ పెట్టించాడు.

వారి వద్ద నెల నెలా మామూళ్లు దండుకుంటున్నా డని మాధవ రావు ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్‌కు, ఎడిఎంకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఆదివారం రైతు బజారు ఆవరణలో కుర్చీ వేసుకుని కూర్చుని ఉన్న వ్యాపారి మాధవరావు ను రైతు బజారు ఎస్టేట్ అధికారి ఫొటో తీయగా ప్రశ్నించడంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. దీంతో రైతు బజారు ఎస్టేట్ అధికారి, దేవా, అశోక్ అనే వ్యాపారులతో పాటు మరో వ్యాపారి దంపతుల సహాయంతో మాధవ రావును, ఆయన కుమారులు సోమేశ్వరరావు, వెంకట సుబ్బా రావు లపై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితులు మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వారు సైతం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కిరాణా దుకాణ యజ మానిపై, ఆయన కుమారులపై ఫిర్యాదు చేశారు. రైతు బజా రులో ఘర్షణ నేపథ్యంలో ఎడిఎం బుచ్చిబాబు ఆదేశాల మేరకు ఇరువురి దుకాణాలను మూసివేయించారు.

ఎస్టేట్ అధికారిపై ఆరోపణల వెల్లువ

రైతు బజారు ఎస్టేట్ అధికారి రమేష్ రైతు బజారులోని ప్రతి దుకాణ దారుని వద్ద నెలా నెలా మామూళ్లుదండు కుంటున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కిరాణా దుకాణ యజమాని మాధవరావు, రమేష్ పై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని వాదనలు లేకపోలేదు. తాజాగా రైతు బజారు లోని దుంపలు అమ్మే మహిళా వ్యాపారి వద్ద నుంచి రెన్యువల్ ఫీజు పేరుతో రూ.20వేలు రమేష్ తీసుకున్నారని, రెన్యువల్ చేయకుండా దుకాణం ఖాళీ చేయాలని మహిళా వ్యాపారిని బెదిరించినట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసు కోవాలని రైతు బజారు దుకాణ దారులు కోరుతున్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఫిరంగిపురం

గత మార్చి 19వ తేదీన నాదెండ్లలో గ్యాస్ బండ లీకై జరిగిన ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమైన పొత్తూరి రామయ్య పూరిల్లు పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ ఘటనలో కూతురి కాన్పు కోసం దాచుకున్న రూ.40 వేలు, బంగారు, వెండి వస్తువులు, పిల్లల సర్టిఫికెట్లు,ఆధార కార్డులు, బియ్యం కార్డు కట్టు బట్టలతో సహా పూర్తిగా కాలిపోయాయి. సుమారు రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ఆహా సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. బేతపూడి హరిదాసులు రూ.6,700, ఆహా సంక్షేమ సంఘం వారు రూ.14, 958, హైదరాబాద్ హెల్పింగ్ హాండ్స్ దాసు ఆఫీసర్స్ గ్రూపు వారు రూ.15, 000, డాక్టర్ పంతగాని శోభారాణి రూ.5,000, గుజ్జు శ్రీనివాసరావు 2,116 ఆర్థిక సహాయం ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆహా, ఉపాధ్యక్షుడు కొరివి పుల్లారావు,కార్యదర్శి చెవుల నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత ఖర్చులతో

తోపుడు బండ్లు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లికి చెందిన పలువురు చిరు వ్యాపారులకు ఆదివారం ఎమ్మెల్యే ఆర్కే తన సొంత ఖర్చులతో తోపుడు బండ్లను స్థానిక వైసిపి నాయకుల ద్వారా అందించారు.చిరు వ్యాపారాలు చేసే వీరికి సరైన వ్యాపార వసతి లేక ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే వెంటనే స్పందించి... వారి వ్యాపారానికి ఆసరా కల్పించాలన్న ఉద్దేశ్యంతో వారికి



తోపుడు బండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి తాడేపల్లి అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, ఈదులమూడి డేవిడ్ రాజు, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు మేకా వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా ఆలయ పునఃప్రతిష్ట

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని తొండపిలో సుమారు రూ.6 కోట్లతో నిర్మించిన అద్దంకమ్మ తల్లి, భీమేశ్వర స్వామి, వీరభద్ర స్వామి, వినాయక స్వామి, నవగ్రహ మండపాల పునఃప్రతిష్టను ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, మాజీమంత్రి, టిడిపి నాయకులు కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే వైవి.ఆంజనేయులు, జనసేన నియోజకవర్గ నాయకులు బి.వెంకటప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది.



మొక్కజొన్న చేను అగ్గిపాలు

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండలంలోని పెనుమూలి గ్రామానికి చెందిన రైతు నాయుడు శ్రీనివాసరావు కు చెందిన మొక్కజొన్న చేను ఆదివారం సాయంత్రం అగ్గిపాలైంది. చేతికొచ్చి న పంట అగ్గి పాలైంది. దాదాపు రూ.30 వేల వరకు నష్టం జరిగినట్టు సమాచారం.

ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి

ప్రజాశక్తి-ఈపూరు



మండల కేంద్రమైన ఈపూరులో ఎస్సీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి ఆదివారం మృతి చెందారు. బందేల నాగేశ్వరరావు ఉదయాన్నే బహిర్భూమికి వెళ్లి తిరిగి రాక పోవడంతో బంధువులు, కాలనీ వాసులు అతని ఆచూకీ కోసం ప్రయత్నించగా బావిలో నాగేశ్వరరావు మృతదేహాన్ని గుర్తిం చారు. నాగేశ్వరరావు మృతదేహాన్ని గ్రామ సర్పంచ్ పల్లె మీసాల చెం చయ్య, వైసీపీ మండల కన్వీనర్ కోపెల దేవ రాజ్ సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రక్షిత మంచినీటి చెరువు పరిశీలన

ప్రజాశక్తి-రొంపిచర్ల



మండలంలో నల్లగార్లపాడులోని రక్షిత మంచినీటి చెరువును ఆదివారం కౌలు రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ చెరువును పరిశీలించిన కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు మాట్లాడుతూ మూడు గ్రామాలకు మంచినీటిని సరఫరా చేసే రక్షిత మంచినీటి చెరువును వైసిపి నాయకులు చేపలచెరువుగా మార్చారని అన్నారు. 12 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు నల్లగార్లపాడు, మాచవరం, పరగటిచర్ల గ్రామాలకు రక్షిత మంచినీటి సరఫరా చేస్తుందని అన్నారు. అధికార పార్టీ నాయకులు చెరువులో చేపలు పెంచి,వాటిని పట్టుకోవటానికి నీటిని పైపులు ద్వారా బయటకు పంపుతున్నారని చెప్పారు. దీని వలన చెరువులో నీరు లేకపోవడంతో వేసవికాలంలో మూడు గ్రామాల ప్రజలు మంచినీటి కోసం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సంబంధిత ఆర్ డబ్ల్యు యస్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ సమస్యను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పోట్లూరి అంజిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీకీ వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం

ప్రజాశక్తి-మంగళగిరి



మంగళగిరి నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, పాశం వెంక టేష్, బందెల నాజర్ పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీ చైతన్య, నారాయణ విద్యా సంస్థల దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చైతన్య, నారాయణ పాఠశాలలో పాఠ్య పుస్తకాలను అమ్ముతున్నారనీ అన్నారు. ఈ విద్యా సంవత్సరం మొదలవకు ముందే ఇంటర్ బోర్డ్ అధికారులు కళాశాల భవనాలలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని కళాశాలలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక చోట్ల అనుమతి లేని భవనాలలో అకాడమిల పేరుతో కళాశాల నిర్వహిస్తున్నారని అన్నారు. అనేక సార్లు విద్యాశాఖ అధికారులను కలిసి మెమోరాండలు ఇచ్చిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఈ విద్యా సంవత్సరం మొదలవక ముందే క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా విద్యాసంస్థ యాజమాన్యం వారు కళాశాలలో క్లాసులు నిర్వహిస్తే విద్యాసంస్థల ఎదుటే ప్రత్యేక్ష ఆందోళనలను చెపడతామని హెచ్చరించారు.

'చిల్లర రాజకీయాలు అవసరమా?': టిడిపి

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల నియోజకవర్గంలో రాజకీయాలు చిల్లర స్థాయికి దిగజారాయని ప్రతిపక్ష నాయకుల ఫ్లెక్సీలు చింపడం, వారి అనుచరుల టీ స్టాళ్లు, బడ్డీ కొట్లు తగలబెట్టడం చిల్లర పనులు కాక మరి ఏమిటని నియోజకవరగ టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సెంటర్ శుక్రవారం రాత్రి టిడిపి నాయకుడు కామన్ బోయిన గంగులకు చెందిన టీ స్టాల్ ను తగలబెట్టడం దిగజారుడుతనం కాక మరేంటని ప్రశ్నించారు. ఆదివారం ఆ టీ స్టాల్ ను సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఈ దౌర్జన్యాలను ఎదిరిస్తానని అన్నారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-తెనాలి

రూరల్ గ్రామం హాఫ్ పేట సమీపంలో గం జాయిని స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీసులకు ఆదివారం రాత్రి అందిన విశ్వసనీయ సమాచారంతో దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని 2.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఎంఎస్సీ విద్యార్థిని చదువుకు స్నేహ హస్తాలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అచ్చంపేట



ఎంఎస్‌సి అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థినికి ఫీజు నిమిత్తం రూ.25 వేలను స్నేహహస్తాలు స్వచ్ఛంద సంస్థ అందజేసింది. అచ్చంపేట మండలం తాడువాయికి చెందిన సలికేటి అంజలి బాపట్లలోని అగ్రికల్చరల్ కాలేజీలో ఎంఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఆర్థికంగా పేదలు కావడంతో చదువు పూర్తి చేయడానికిగాను ఈ చెక్కును సంస్థ మండల ప్రతినిధి మామిళ్లపల్లి లక్ష్మి ఆదివారం అందించారు. నాలుగేళ్ళుగా బిఎస్‌సి (అగ్రికల్చర్) చదువుకునే సందర్భంలో హాస్టల్ ఫీజు నిమిత్తమూ రూ.లక్షను తమ సంస్థ ద్వారా అందించినట్లు లక్ష్మి చెప్పారు. అంజలి తన ఎంఎస్సీ పూర్తి చేయడానికి నాలుగు సెమిస్టర్లకు గాను ప్రతి సెమిస్టర్‌కు రూ.25 వేలు చొప్పున ఫీజును సంస్థ తరుపునే అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని అంజలి మాట్లాడుతూ తన చదువు పూర్తయినానంతరం స్నేహహస్తాలు సంస్థతో కలిసి పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ టి.కరిముల్లా బాబు పాల్గొన్నారు.



సుభాని చల్లివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని బోల్లవరం అడ్డరోడ్డు వద్ద హోంగార్డు సుభాని ఏర్పాటు చేసిన చల్లివేంద్రంలో సత్తెనపల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ దాతల సహకారంతో చల్లివేంద్రంలో వారంలో ఒకటి రెండు సార్లు మజ్జిగ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు తన వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో 20 ఏళ్లుగా చల్లివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా హోంగార్డుగా ఒక్క పక్క విధులు నిర్వర్తిస్తూ ఖాళీ సమయంలో చలివేంద్రంలో నీటిని సుభానీ అందిస్తున్నారు. ఆయన విధుల్లో ఉన్నప్పుడు కుటుంబీకులు ఈ బాధ్యతను నెరవేరుస్తున్నారు. కార్యక్రమంలో సత్తైనపల్లి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ షేక్ జానీ, వైస్ ప్రెసిడెంట్ సి.హెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దళితులకు భూములు దక్కకుంటే ప్రతిఘటన

- పెత్తందార్లతో కుమ్మక్కయిన ఎన్‌జి రంగ వ్యవసాయ వర్సిటీ అధికారులు
- పేదల సాగులో ఉన్న భూములను కాజేసేందుకు కుట్ర
- కోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయని అధికారులు
- చర్లగుడిపాడులో సమస్యలపై కలెక్టర్‌కు వాట్సప్ ద్వారా వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - నరసరావుపేట

గురజాల మండలం చర్లగుడిపాడులో దళితులకు భూమి దక్కనీయకుండా అడ్డుపడుతున్న పెత్తందార్ల ఆటలు సాగనివ్వబోమని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి అన్నారు. దళితులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్‌కు వాట్సప్ ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ చర్లగుడిపాడులోని సుమారు 300 ఎకరాల ప్రభుత్వ భూములను స్థానిక దళితులకు, భూమి లేని పేదలకు దక్కకుండా జంగమేశ్వరపురానికి చెందిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉద్యోగులు, చర్లగుడిపాడులోని పెత్తందార్లతో కుమ్మక్కయ్యారని చెప్పారు. ఆయా భూములను విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం కేటాయించినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో ఈ భూముల్లో చర్లగుడిపాడు దళితులు వరి సాగు చేసుకుని జీవిస్తుండగా రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారంతో పెత్తందార్లు దౌర్జన్యం చేశారని, దళితులపై తప్పుడు కేసులు పెట్టి బెదిరిస్తున్నారని మండిపడ్డారు. దళిత రైతులపై పెట్టిన తప్పుడు క్రిమినల్ కేసును ఇటీవల న్యాయస్థానం కొట్టివేయడంతో పాటు ఆ భూములకు రెవెన్యూ నిబంధనల ప్రకారం భూమిలేని దళితులైన వారికి డీకే పట్టాలివ్వాలని గత నవంబర్‌లో తీర్పునిచ్చినట్లు వివరించారు.

ఇదిలా ఉండగా ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయ విత్తన పరిశోధన సంస్థకు ప్రభుత్వం వారు గురజాల రెవెన్యూలోని పట్టా నంబర్ 5227 ద్వారా 23 ఎకరాలను 1978లో కొనుగోలు చేసి కేటాయించారని, చర్లగుడిపాడు రెవెన్యూలో వారికి భూమి లేనట్లు రికార్డుల ద్వారా తెలుస్తోందని చెప్పారు. విశ్వవిద్యాలయంలోని ఉద్యోగులు, గ్రామంలోని కొందరు పెత్తందారులు కలిసి కుట్ర పన్నుతున్నారని, దళితులు సాగు చేస్తున్న భూములు విద్యాలయం తాలూకు భూములంటూ వరి పంటను నాశనం చేశారని అన్నారు. పైగా సాగుదార్లపైనే తప్పుడు కేసు పెట్టారని, ఆనాటి తహశీల్దార్ రఘురామ్ పోలీసుల సహకారంతో దళితులను భూములలోకి రాకుండా బెదిరించారని తెలిపారు. అనంతరం పరిణామాల నేపథ్యంలో కోర్టు తీర్పు మేరకు పట్టాల కోసం దళితులు ఆరు నెలలుగా తిరుగుతున్నారని, వెంటనే వారికి డీకే పట్టాలివ్వాలని డిమాండ్ కేశారు. విత్తన పరిశోధన సంస్థకు ఈ భూములు కేటాయించాలనుకుంటే, మొదట చర్లగుడిపాడులోని భూమిలేని దళితులకు పట్టాలిచ్చి, 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామ సభ జరిపి, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇవేమీ లేకుండా తీసుకోవాలనుకుంటే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. గ్రామంలోని ప్రతి దళిత కుటుంబానికి కనీసం ఎకరం ఇవ్వాలని, ఈ అంశాల్లో కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.



బాధిత దళితులతో కలిసి చర్లగుడిపాడులోని ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి



బాణసంచా పేలుస్తూ నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

కర్ణాటకలో గెలుపుపై కాంగ్రెస్ సంబరాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన సందర్భంగా పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో పట్టణ అధ్యక్షులు ఎం.ప్రసన్న మాట్లాడుతూ కర్ణాటకలో గెలుపు దేశ రాజకీయాల్లో శుభారంభమని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి గోవింద్ శంకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ విజయం లౌకిక వాదుల విజయమని, కర్ణాటకలో నివసిస్తున్న తెలుగు ప్రజల ఆశీర్వాదమని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ముస్లిమ్ మైనారిటీలు కర్ణాటక ముస్లిములను ఆదర్శంగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ వెంట నడవాలని కోరారు. ఎం.రాధాకష్ణ మాట్లాడుతూ ప్రజల మధ్య మతచిచ్చు పెట్టాలనే మతోన్మాదం బిజెపిని కన్నడ ప్రజలు తిరస్కరించారన్నారు. కర్ణాటకలో విజయం స్ఫూర్తితో రాహుల్ గాంధీ ప్రధానిని చేసేంతవరకు ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త అవిశ్రాంత పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.చంద్ర, ఎన్.వెంకటేష్, నసురుద్దీన్, ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దాచేపల్లి

భారత్ జొడో యాత్ర ఫలితమే కర్ణాటక గెలుపు అని దాచేపల్లి నగర పంచాయతీ 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ అన్నారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరిస్తారని చెప్పారు. మతతత్వాన్ని ప్రోత్సహించే బిజెపికి అధికారం కోల్పోయే రోజులు దగ్గరలో పడ్డాయన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనటానికి కర్ణాటక ఎన్నికలు నిదర్శనమని అన్నారు.



పొలంలోని గడ్డిని కట్టలుగా చుడుతున్న యంత్రం

పశుగ్రాసం కోసం మళ్లీ యంత్రం..

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లాలో అనేక ప్రాంతాలలో తొలకరిలో పంట సాగు చేసిన రైతులు వెంటనే దాళ్వాలో మొక్కజొన్న సాగుకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో హడావుడిగా యంత్రాల ద్వారా పంటను నూర్చడంతో అనంతరం పశుగ్రాసం కొరత ఏర్పడింది. ఈ అనుభవం దృష్ట్యా కొంతమంది రైతులు రబీలో యంత్రాలను కాకుండా కూలీలతో వరికోతలు కోస్తున్నారు. మరోవైపు ఇప్పటికే యంత్రాలతో కోతకోసిన పొలాల్లోని గడ్డిని యంత్రాలతోనే కట్టలు కట్టిస్తున్నారు. ఇందుకోసంగాను యంత్రాన్ని రూ.3 లక్షలతో కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు.



దాళ్వ వరికోత పనుల్లో నిమగ్నమైన కూలీలు



శిక్షణ పొందిన వైద్య సిబ్బందితో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శోభారాణి, జిజిహెచ్ సూపరింటెండెంట్

పల్నాడు వైద్యబృందాలకు జిజిహెచ్‌లో ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - నరసరావుపేట

కంప్రెహేన్సివ్ అబోర్షన్ కేర్‌పై పల్నాడు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న 32 మంది వైద్యులకు గుంటూరు జిజిహెచ్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించామని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి తెలిపారు. ఆదివారం శిక్షణ అనంతరం జిజిహెచ్‌లో ఆమె వైద్యబృందంతో కలిసి మాట్లాడారు. పల్నాడులోని వైద్య సిబ్బందిని 4 బృందాలుగా విభజించి ఒక్కో బృందంలోని 8 మందికి మూడ్రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తల్లికి ఏవిధమైన ఆరోగ్య సమస్యలూ రాకుండా అబార్షన్ చేయుటకు నైపుణ్యం, మెలకువలపై శిక్షణిచ్చామన్నారు. ప్రమాదకర స్థితిలో ఉన్న గర్భిణులకు, అవాంచిత గర్భాలు, గర్భస్థ శిసువు వైల్యంతో ఉన్నపుడు, అవివాహితులు గర్భం దాల్చినపుడు, తల్లి ప్రాణానికి ప్రమాదం ఉన్నపుడు, టీనేజ్ గర్భం, లైంగిక దాడికి గురైనప్పుడు, సామజిక సమస్యలు కారణాల వలన తల్లి గర్భం వద్దు అనుకున్న పరిస్థితుల్లో 1971-72 ఎంటిపి చట్టం ప్రకారం అబార్షన్ చేయించుకొనుటకు అవకాశం ఉందని వివరించారు. ఆయా సమయాలలో గర్భం తొలగించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గర్భం దాల్చిన తొమ్మిది వారాల్లోపు గర్భిణులకు ప్రభుత్వ విధి విధానాల మేరకు అబార్షన్ చేసే విధానంపై శిక్షణ, కౌన్సిలింగ్ ఇప్పించామన్నారు. శిక్షణ ఇచ్చిన వైద్య సిబ్బంది, గైనకాలజీ హెచ్‌ఒడి డాక్టర్ పి.జయంతి, బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ శిక్షణ పొందిన వైద్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్మునిజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, వ్యాధినిరోధక టీకా అధికారి డాక్టర్ టి.షర్మిళ పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో విలవిల

- ఒక్కోసారి హైఓల్టేజి..లోవోల్టేజి సమస్య
- దెబ్బతింటున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాలు
- మరోవైపు ఎండ తీవ్రత, వడగాల్పులు


చినరావూరులో 33కెవి విద్యుత్ సబ్‌స్టేషన్

ప్రజాశక్తి-తెనాలి

అప్రకటిత విద్యుత్ కోతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విద్యుత్ లైన్ల మరమ్మతుల పేరుతో ముందుగా ప్రకటించిన విద్యుత్ కోతలకు అదనంగా విద్యుత్ కోతలు అమలౌలున్నాయి. మరోవైపు అనుకోకుండా హైవోల్టేజి రావటం. లేదంటే లో వోల్టేజితో విద్యుత్ ఉన్నా లేనట్టే కాలం వెళ్ళదీయాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. అధికారులు మాత్రం విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయటం మినహా పవర్ కట్ లేదని చెబుతున్నారు. తెనాలి విద్యుత్ ఈఈ పరిధిలో ప్రకటిత, అప్రకటిత విద్యుత్ కోతల పరిస్థితులిలా ఉన్నాయి.

తెనాలి కేంద్రంగా విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయం ఉంది. ఆయన పరిధిలో ఎక్కడైనా విద్యుత్ లైన్ల మరమ్మతులుంటే అధికారులు ముందుగానే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేసి, పనులు పూర్తయ్యేందుకు నిర్ణీత సమయం కేటాయించి, ఎంత సమయం, ఏప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారో ముందుగానే తెలియజేస్తారు. అదే ప్రకారం ఈ నెలలో అధికారికంగా ప్రకటించిన విద్యుత్ కోత రెండు రోజులు మాత్రమే. ఈనెల 11న పట్టణ ప్రాంతం మారీసుపేటలో ఉదయం 10 గంటల నుంచి మద్యాహ్నం 2 గంటల వరకూ ప్రకటించారు. అలాగే ఈనెల 13న అంటే రెండో శనివారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చోట ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విద్యుత్‌కోత విదిస్తున్నట్లు డిఈ తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకూ విద్యుత్ కోతలకు సంబంధించి అధికారికంగా ప్రకటించిన రెండు సందర్భాలు ఇవే. కాని ఇటీవల రూరల్, పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించారు. విద్యుత్ సరఫరా నిలిచిన ప్రతిసారి కనీసం 15 నిముషాలు, గరిష్టంగా అర్ధగంట విద్యుత్ నిలిచిపోయింది. అప్పుడప్పుడూ రాత్రి వేళల్లో కూడా ఇదే పరిస్థితి ఎదురౌతోంది. ఓవైపు పగలు 42 డిగ్రీలను మించిన ఉష్ణోగ్రత. తీవ్రమైన వడగాలి. బయటకు రాలేక ఇళ్ళలోనే మగ్గిపోవాల్సిన పరిస్థితి, అర్ధరాత్రి వరకూ వాతావరణం చల్లబడటం లేదు. దీనికి తోడు అప్రకటిత విద్యుత్ కోతలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. హైఓల్టేజీ, లోఓల్టేజీ సమస్యలతో ఫ్రిడ్జ్, ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు వంటివి దెబ్బతింటున్నాయని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు మాత్రం ఎలాంటి విద్యుత్ కోతలు లేవంటున్నారు.

ఉదయం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

పట్టణంలోని గాంధీనగర్, నందులపేట ప్రాంతంలో ఆదివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేదు. ఒకదఫా విద్యుత్ నిలిపి వేసిన అధికారులు పది నిమిషాల్లో తిరిగి ఇచ్చి, వెంటనే సరఫరా నిలిపి వేశారని స్థానికులు చెబుతున్నారు. గాంధీనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ నిలిపి వేశారని, తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు విద్యుత్ సరఫరా ఇచ్చారని, అలాగే నందుపేటలో కవి రాజాపార్కు ప్రాంతంలో ఉదయం పదిగంటలకు విద్యుత్ నిలిపివేసి, సాయంత్రం ఐదున్నర గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు చెబుతున్నారు. పగలు విపరీతమైన ఎండ, వడగాలికి అల్లాడిపోయామని, డి3 సెక్షన్‌కు పలుమార్లు ఫోన్‌చేసినా ఎవ్వరూ స్పందించలేదని చెబుతున్నారు.

చాలా ఇబ్బందికరంగా ఉంటోంది

జి.ప్రసాద్, విశ్రాంత ఉద్యోగి, హయ్యర్‌పేట



ఎప్పుడు పడితే అప్పుడు కరెంటు వస్తుంది, పోతుంది. ఇటీవలి కాలంలో రాత్రి పది గంటల సమయంలో దాదాపు గంటన్నరల విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బయట వాతావరణంలో వేడి తగ్గలేదు. ఇంటా, బయటా ఉండలేని పరిస్థితి. ఒకటే ఉక్కపోత. దానికి తోడు దోమల తీవ్రత. అతంత మాత్రం ఆరోగ్యానికి తోడు విద్యుత్ కోతతో నరకమనిపించింది. ఇప్పటికైనా అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలి.

శాఖపరంగా సంస్కరణలు అనివార్యం

కె.బాబుప్రసాద్, సిఐటియు జిల్లా కార్యదర్శి



విద్యుత్ కోతలు అధిగమించాలంటే శాఖాపరంగా సంస్కరణలు అనివార్యం. గాలికి చెట్ల కొమ్మలు తగిలి వైర్లు తెగిపోతున్నాయని, వాటి మరమ్మతులకు విద్యుత్ నిలిపివేస్తున్నామనటం సరికాదు. చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తగలకుండా పెట్రోలింగ్ నిర్వహించాలి. అంటే ఎప్పటికప్పుడు పెరిగిన కొమ్మలను తొలగించాలి. కండక్టర్లు ట్రిప్ అయినప్పుడు విద్యుత్ సరఫరాకు ఆటోమేటిక్‌గా నిలిపివేసే బ్రేకర్లు సరిగా పనిచేసేలా చూసుకోవాలి. పాత కండక్లర్లను తొలగించాలి. ఇన్సులేషన్ మార్చాలి, 132కెవి, 33కెవి సబ్‌స్టేషన్లలో ప్రణాళికాబద్ధమైన నిర్వహణ అవసరం. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్ ఉండేలా చూసుకోవాలి. ఓల్టేజి నియంత్రణ ఉండాలి. లేని పక్షంలో విద్యుత్‌తో పనిచేసే గృహోపకరణాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

విద్యుత్ కోతలు లేవు

బి.అశోక్‌కుమార్, విద్యుత్ డిఇ, తెనాలి



విద్యుత్ కోతలు అమల్లో లేవు. ఏదైనా విద్యుత్ లైన్ల మరమ్మతులుంటేగాని, సబ్ స్టేషన్ల పరిధిలో పనులు జరుగుతున్నా విద్యుత్ నిలిపివేసే సమయాన్ని ముందుగానే ప్రకటిస్తున్నాం. అయితే కొన్ని సమ యాల్లో ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట పైస్థాయిలోనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. దానిని ముందుగా ప్రకటించే అవకాశం ఉండదు. వేసవి గాలులకు ఎక్కడైనా లైన్లు దెబ్బతింటే, వాటిని బాగుచేసే క్రమంలో అప్పుడప్పుడూ అంతరాయం ఏర్పడుతోంది.

పెన్షనర్ల ఇకెవైసి గడువు పెంచాలి

ప్రజాశక్తి-తెనాలి:

ప్రభుత్వ పించనుదారుల ఈకేవైసి గడువు పెంచాలని ఏపి పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి శాఖ ప్రదాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు కోరారు. ట్రెజరీల ద్వారా చేపట్టిన ఈకేవైసి ప్రక్రియ కనీసం 50 శాతం కూడా పూర్తికాలేదన్నారు. పించనుదారుల్లో వయోవృద్ధులు అధికంగా ఉన్నారని, వేసవి తీవ్రతకు వారు బయటకు రాలేని పరిస్థితులున్నాయన్నారు. ఇదిలా ఉంటే చాలా మంది ఫించనుదారులకు ఈకేవైసి గురించి తెలియలేదన్న భావన వ్యక్తమౌతోందన్నారు. కొంత మంది అధార్ కార్డులకు మొబైల్‌ఫోన్ నెంబర్‌ను అనుసంధానం చేయలేదని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ కేవైసి గడువు పెంచాలని ఆయన కోరారు. అలాగే ఫించనుదారులు కూడా అలసత్వం ప్రదర్శించ వద్దని ఈ కేవైసి ప్రభుత్వ విధానాల ప్రకారం తప్పనిసరి అని భావించి త్వరపడాలన్నారు. ఏదైనా సమాచారం అవసరమైతే కార్యాలయం పనివేళల్లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

దేశ సమైక్యతకు భంగం కలిగిస్తున్న బిజెపి

కాజలో సింహాద్రి వాసుదేవారెడ్డి 14వ సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

భారత దేశం లౌకిక రాజ్యాంగాన్ని రూపొందించుకొని లౌకిక శక్తిగా ఉన్న దేశం నేడు మత ఉన్మాద ప్రమాదం లో పడిందని నాయకులు పేర్కొన్నారు. మండలం లోని కాజా గ్రామ సీపీఎం సీనియర్ నాయకులు సింహాద్రి వాసు దేవా రెడ్డి 14వ వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. తొలుత వాసు దేవారెడ్డి చిత్ర పటానికి సీపీఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చె చెంగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కె. హరి కిషోర్, సిపిఐ ఎంఎల్ నాయకులు సింహాద్రి సుబ్బారెడ్డి , సింహాద్రి వాసుదేవారెడ్డి భార్య సింహాద్రి సామ్రాజ్యం, బి. కోటేశ్వరి, ఈదా మాధవ రెడ్డి, కారుమూరు మాధవ రెడ్డి, సి ఝాన్సి తదితరులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యులు ఈదా ప్రతాపరెడ్డి అధ్యక్షత నిర్వహించిన సభలో నాయకులు ప్రసంగించారు. సిపిఎం అభివృద్ధికి వాసుదేవా రెడ్డి చేసిన కృషిని వివరించారు. బాలల సంఘాన్ని ఏర్పాటు చేసి బాలలను సమీకరించడం, యువజన సంఘాన్ని ఏర్పాటు చేసి యువకులను చైతన్య పరచడంలో ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాడు గ్రామాభివద్ధికి పాటు పడే ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యే వారని, నేడు కోట్లు రూపాయలు ఉన్నవారే ఎన్నికవుతున్నారన్నారు. సామాజిక స్పృహ కమ్యూనిస్టులకు మాత్రమే ఉంటుందని వారే నిస్వార్థం గా ప్రజల కోసం పని చేస్తూ ఉంటారని చెప్పారు. నేడు బిజెపి లాంటి మతోన్మాద శక్తులు దేశానికి ప్రమాదకరంగా మారాయని చెప్పారు. అటువంటి బిజెపి ని చూసి రాష్ట్రం లోని వైసిపి, టీడీపీ లు రెండూ దాసోహం అంటూ వ్యవహరిస్తున్నాయని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రవేశ పెట్టిన బడ్జెట్ లన్ని పెద్దల కోసం తప్పా పేదలకు ఏ మాత్రం ఉపయోగపడలేదు అన్నారు. ఆయా బడ్జెట్ లలో రాజధానికి గానీ, విశాఖ రైల్వే జోన్‌కి గానీ, పోలవరం ప్రాజెక్టుకు అదనపు నిధులు గానీ, ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు గానీ నిధులు కేటాయిం చలేదన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పై ఉందన్నారు. భారతదేశం కి స్వాతంత్ర్య కోరని అర్ ఎస్ ఎస్, బిజెపి లను, గాంధీని హత్య చేసిన మతోన్మాద శక్తులను సాగనంపాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు జెవి రాఘవులు తదితరులు


సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య


సానియాను అభినందిస్తున్న రాయపాటి శ్రీనివాసరావు తదితరులు

ఇంటర్ బైపిసిలో తెలంగాణా రాష్ట్ర మొదటి ర్యాంకర్

సానియాకు ఘన సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలంగాణలో ఇటీవల విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో బైపిసీలో రాష్ట్ర స్థాయిలో మొదటిర్యాంకు సాధించిన కరీంనగర్ మైనార్టీ కళాశాల విద్యార్థినీ సానియాకు ఆదివారం గుంటూరులో ఘన సన్మానం జరిగింది. స్థానిక ఎస్‌విఎన్ కాలనీలోని వికాస్ ఇన్ హోటల్‌లో ప్రముఖ వ్యాపారవేత్త, రోటరీ క్లబ్ ఎలక్ట్ ప్రెసిడెంటు కొమ్మలపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తన ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వర్కర్ ఎండీ రెహమాన్ కుమార్తె సానియా రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించినందుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్ పాల్గొని సానియాను అభినందించారు. అనంతరం రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ మైనార్టీ కుటుంబానికి చెందిన సానియాకు కొమ్మాలపాటి శ్రీనివాసరావు ఘనంగా సన్మానించి ప్రోత్సాహాన్ని ఇవ్వటం అభినందనీయం అన్నారు. కొమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సానియా మా కుటుంబంలో అమ్మాయిగా భావించి నేను ఉన్నత చదువులు కూడా తోడ్పాటు అందిస్తానని తెలిపారు. సానియా తండ్రి తన దగ్గర పని చేస్తూ అమ్మాయి గురించి చెప్పగానే తన వంతు సహాయం అందిస్తానని భరోసా ఇచ్చినట్టు తెలిపారు. ఎన్నో అనాధాశ్రమాలు , వృద్ధాశ్రమాలు, పేద విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఫీజులు కట్టుకోలేని పరిస్థితిలో ఉన్నవాళ్లకి ఎంతోమందికి సేవ చేస్తున్నామని కొమ్మాలపాటి శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో మద్దినేని సుధాకర్, రోటరీ క్లబ్ మెంబర్స్ సరిపూడి అనిల్, రాజశేఖర్, స్రవంతి, జ్యోతిర్మయి వంశీ , వీరయ్య ,డాక్టర్ రాకేష్ , షాజహాన్ , సురేష్ , ప్రభాకర్, డాక్టర్ వీరశేఖర్, రమేష్ , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రభావతి, డాక్టర్ శేషయ్య

మానవత సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

నేటి యువత రక్తదాతలుగా మారి ప్రాణదానం చేయాలని డాక్టర్ శేషయ్య అన్నారు. ఆదివారం జివిఆర్ అండ్ ఎస్ మహిళా కళాశాలలో మానవత సంస్థ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు రక్తం చాలా కొరతగా ఉందని, మానవత సంస్థలాంటి సంస్థలు ముందుకు వచిచ సహాయ పడాలని కోరారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ కృషిని అభినందించారు. డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ రక్తదానం తరచూ చేయటం వల్ల కొన్ని శారీరక రుగ్మతలు తొలగిపోతాయని అన్నారు. సంస్థ అధ్యక్షులు నల్లమోతు రామారావు మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న వారిని ఆదుకోవటానికి మానవతా సంస్థ కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జివిఆర్ అండ్ ఎస్ విద్యా సంస్థల చైర్మన్ భువనేశ్వరి, ప్రిన్సిపాల్ సునీల్, మానవత సంస్థ ఉపాధ్యక్షులు పి.గురువారెడ్డి, జెవివి అధ్యక్షులు బి.ప్రసాద్ పాల్గొన్నారు.



షణ్ముఖ అమ్మాజీని అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ రఫాని

విద్యార్థిని షణ్ముక అమ్మాజీకి చైర్మన్ అభినందన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన స్థానిక మోడరన్ హైస్కూలు విద్యార్థినిని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆదివారం తన కార్యాలయంలో అభినందించారు. 589/600 మార్కులు సాధించి పట్టణములో మొదటి స్థానంలో నిలిచిన ఎం.షణ్ముఖ అమ్మాజీ భవిష్యత్‌లోనూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమములో విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విష్ణు, మున్సిపల్ ఎఇ సిహెచ్ శ్రీనివాస్, కాంట్రాక్టర్లు వి.శ్రీను పాల్గొన్నారు.

బ్యాటరీ సైకిల్ అందించిన అరవిందబాబు

ప్రజాశక్తి-నరసరావుపేట



పట్టణంలోని బరంపేటకు చెందిన విభిన్న ప్రతిభావంతుడు సయ్యద్‌వలి (సీతయ్య)కు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు బ్యాటరీ సైకిల్‌ను ఆదివారం అందజేశారు. అరవిందబాబకు సయ్యద్ వలి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.



కళ్లజోళ్లు అందిస్తున్న జాన్‌సైదా

జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - యడ్లపాడు : గ్రామాల్లోని పేదలు నివసించే ప్రాంతాల్లో జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని సంస్థ చైర్మన్ షేక్ జాన్‌సైదా అన్నారు. ఆదివారం యడ్లపాడు మండలం బోయపాలెంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పలువురికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లను అందించారు. జె.సుబ్బారావు, కె.చిట్టిబాబు, ఎ.శ్యామ్, ఎన్.సుబ్బారావు, రసూల్ పాల్గొన్నారు.

పల్నాటి యాదాద్రిలో బాలినేని శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - దాచేపల్లి

గురజాల నగర పంచాయతీలో జంగమహేశ్వరపురంలో పల్నాటి యాదాద్రి లక్ష్మి నరసింహస్వామి ఆలయాన్ని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆయనకు వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బడే జాని, నాయకులు నాగుల్‌మీరా, గాంధీ, సైదారెడ్డి పాల్గొన్నారు.







క్రోసూరు, ముప్పాళ్ల మండలం మాదలలో ఆమంచి నరసింహారావు చిత్రపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



రెంటపాళ్లలో లింగారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అమరుల ఆశయాలను సాధిద్దాం..

- ఆమంచి నరసింహారావు, జమడ్లమూడి లింగారావు వర్ధంతి సభల్లో సిపిఎం నాయకులు
- చిత్రపటాలు, స్తూపాల వద్ద నివాళులు

ప్రజాశక్తి-క్రోసూరు

సమసమాజం రావాలని పాటుపడిన వ్యక్తి ఆమంచి నరసింహారావు అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు అన్నారు. క్రోసూరులో ఆదివారం నిర్వహించిన వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ ఆమంచి నరసింహారావు స్వాతంత్రానికి ముందు బ్రిటిష్ వాళ్లపైన ఆ తర్వాత భారత పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపైన అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. సత్తెనపల్లి తాలూకా ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. నరసింహారావు వంటి వారి పోరాటాలు, త్యాగాల ఫలితంగా సాధించిన స్వాతంత్ర్యాన్ని, వాటి ఫలాలను నేటి పాలకులు కార్పొరేట్ అధిపతులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ సమ సమాజ స్థాపన కోసం పనిచేయటమే ఆమంచికి ఇచ్చే నివాళి అని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎ.ఆంజనేయులు, మండల కార్యదర్శి టి.హనుమంతరావు, నాయకులు ఏపూరి వెంకటేశ్వర్లు, ఇశ్రాయేలు, షేక్ ముస్తఫా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ముప్పాళ్ల

మండలంలోని మాదలలోని సిపిఎం కార్యాలయంలో ఆమంచి నరసింహారావు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడారు. నాయకులు ఎం.వెంకటరెడ్డి, పి.సైదాఖాన్, కె.సాంబశివరావు, జి.జాలయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

కష్టజీవుల విముక్తి కోసం జమండ్లమూడి లింగారావు అహర్నిశలు పనిచేశారని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య అన్నారు. మండలంలోని రెంటపాళ్లకు చెందిన సిపిఎం నాయకులు లింగారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి, స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ లింగారావు నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు నిలబడ్డారని, ఆయనతోపాటు కుటుంబ సభ్యులను కూడా పార్టీలో ఉండేటట్టు చైతన్యపరిచారని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకునిగా, వ్యవసాయ కూలీల రేట్లు పెంపు కొరకు పేదలకు భూమిని పంచాలని, కుల వివక్షపై పోరాడారని చెప్పారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు, మండల కార్యదర్శి పి.మహేష్, నాయకులు ఎం.నరసింహారావు, జె.భగత్ బి.రామారావు, అనూష, సుజాత, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో నేడు టిడిపి పాదయాత్ర

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎన్నికలు మరో ఏడాదిలోపే ఉన్న నేపథ్యంలో పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేయాలని టిడిపి శ్రేణులకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. స్థానిక పండరిపురంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ శిక్షణలో ఆయన మాట్లాడారు. లోకేశ్ పాదయాత్ర చేపట్టి 100 రోజులు పూర్తవుతున్న సందర్భంగా పట్టణంలో సోమవారం 7 కిలోమీటర్ల ర్యాలీ ఉంటుందని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి శ్రేణులు తరలిరావాలని కోరారు. వివిధ అంశాలపై కోటిరెడ్డి, రమేష్, ఎం.అప్పారావు, ఎం.వెంకటరావు వివరించారు. ఇదిలా ఉండగా స్థానిక రాగన్నపాలెం ప్రాంతానికి చెందిన టిడిపి బూత్ క్లస్టర్ సుధ కుమార్తె, మోడరన్ స్కూల్ విద్యార్థిని షణ్ముఖ అమ్మాజీ పదో తరగతిలో 589/600 మార్కులు సాధించినందుకు గాను పుల్లారావు సత్కరించారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - వినుకొండ

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ వి204 ఏ ఆధ్వర్యంలో స్థానిక వెల్లటూరు రోడ్డులోని గోపు బాలిరెడ్డి ఇండోర్ స్టేడియం చెస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. బ్యాడ్మింటన్‌లో వినుకొండ పట్టణానికి చెందిన కె.శ్రీహరి, ఐ.ఆంజనేయులు విజయం సాధించగా ఐ.రమేష్‌బాబు. సుగ్రీవు కుమార్ రాజా రన్నర్స్‌గా నిలిచారు. చెస్‌లో సత్తెనపల్లి పట్టణానికి చెందిన పి.బాల మనోజ్ గుప్తా ప్రథమ స్థానం, వినుకొండ పట్టణానికి చెందిన కె.వెంకట సుబ్బారావు ద్వితీయ స్థానంలో నిలిచారు. జిల్లా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఇన్‌ఛార్జి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కొత్తమాసు కాశీ విశ్వనాథం ముఖ్యఅతిథులుగా హాజరై జిల్లా గవర్నర్ ఖజ్జాయం విజయలక్ష్మితో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. ఇక్కడ విజయం సాధించిన వారు ఈనెల 28న విజయవాడలో జరిగే ఫైనల్స్‌లో వీరు జిల్లా తరపున పాల్గొంటారని తెలియజేశారు. కార్యక్రమంలో జె.సువర్ణ లక్ష్మి, ఎం.చిరంజీవి, ఎం.వెంకట కిరణ్ కుమార్, వి.కేశవరావు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు



టిడిపి వినుకొండ పట్టణ నూతన అధ్యక్షునిగా అయూబ్‌ఖాన్

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని అన్ని వార్డుల్లో టిడిపిని బలోపేతం చేయాలని ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జీ.వీ.ఆంజనేయులు సూచించారు. టిడిపి పట్టణ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పఠాన్ అయూబ్‌ఖాన్ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం టిడిపి కార్యాలయం వరకు భారీ ప్రదర్శన చేశారు. పార్టీ కార్యాలయంలో అయూబ్‌ఖాన్‌తో జీవీ ఆంజనేయులు ప్రమాణస్వీకారం చేయించారు.

ఉపాధి హామీలో మేట్ల వ్యవస్థను కొనసాగించాలి

చట్టం పరిరక్షణ కోసం 22న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఉపాధి హామీ చట్టంలో మేట్ల వ్యవస్థను కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం పని ప్రదేశాల వద్దకు యాత్రలో భాగంగా మండలంలోని మాదలలో ఆదివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతోందని, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్ యాప్) అందులో భాగమని చెప్పారు. గతంలో 20 మంది కూలీలకు ఒక మేట్ (మేస్త్రి) ఉండి పని కొలతలు ఇచ్చి కూలీల చేత క్రమబద్ధంగా పని చేయించేవారని, ఇప్పుడు ఈ యాప్ తెచ్చి మేట్‌ల వ్యవస్థను రద్దు చేశారని, ఫలితంగా ఉపాధి హామీ పనులు సరిగా కల్పించడం లేదని అన్నారు. దేశంలోని వ్యవసాయ కూలీలందరికీ చట్ట ప్రకారం వందరోజుల హక్కు అమలు చేయాలంటే కనీసం రూ.మూడు లక్షల కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉండగా ఈ ఏడాది బడ్జెట్లో రూ.70 వేల కోట్లే కేటాయించారని తెలిపారు. వీటిల్లో రూ.20 వేల కోట్లు పాత బకాయిలకు సరిపోతాయని, ఇక కొత్తగా పనులు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో పొమ్మనకుండా పొగ పెట్టినట్లుగా, కఠినమైన నిబంధన రూపొందించి ఉపాధి హామీ పనులకు కూలీలు రావడాన్ని నిరుత్సాపరిచేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పని విధివిధానాలను నిర్ణయించేవవని, ఇప్పుడు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం పెట్టిన తర్వాత విధివిధానాలన్నీ ఢిల్లీలో కూర్చున్న పెద్దలే నిర్ణయిస్తున్నారని, దీనివల్ల ప్రాంతీయ వైవిధ్య పరిస్థితుల వల్ల ఢిల్లీ పెద్దలు నిర్ణయించిన సూత్రాలు ఇక్కడ కూలీలకు ఆటంకంగా తయారవుతున్నాయని వివరించారు. ఉపాధి హామీ అమలుపై నియంత్రణ పంచాయతీలకు, మండల పరిషత్తులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ను రద్దుచేసి పాత పద్ధతుల్లోనే ఉపాధి పనులు చేయించాలని, తాగునీరు, పనిముట్లు పదును పెట్టుకోవడానికి అలవెన్సులు పునరుద్ధరించాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై ఈ నెల 22న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో కూలీలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.సైదాఖాన్, కె.నాగేశ్వరరావు, జి.జాలయ్య, నాగమల్లేశ్వరరావు, కె.సాంబశివరావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, గ్రామస్తులు

పిల్లలూ..ప్రశ్నించేతత్వం అలవర్చుకోండి

ప్రజాశక్తి-తాడేపల్లి

పిల్లలు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని మంగళగిరి,తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి కోరారు. తాడేపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి గురువారం వరకు ఐదు రోజుల పాటు జరుగుతున్న సమ్మర్ క్యాంపును తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగి భీమవరపు దశరధరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా వక్తలను చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు సోలా ముత్యాలరావు వేదిక పైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు జరుగుతున్న విషయాలను పిల్లలు తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. క్లాస్ పుస్తకాలే కాకుండా చరిత్రకు సంబంధించిన పుస్తకాలు చదవాలని,అందుకు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని చెప్పారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహానుభావులు తమజీవితాలను తృణప్రాయంగా అర్పించి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారన్నారు. 200 ఏళ్ల పాటు దేశాన్ని పరిపాలించిన బ్రిటీష్ రాజ్యాధాకారాన్ని అహింసా మార్గంలో గాంధీజీ పోరాడి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో ఏ ప్రాత లేని,



మాట్లాడుతున్న మంగళగిరి,తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులు

బ్రిటీష్ వారి దగ్గర క్షమాభిక్ష కోరి పొర్లు దండాలు పెట్టిన పాలకులు నేడూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెల్ల దొరలను ఎదిరించి గుంటూరు జిల్లాలో (పల్నాడు జిల్లా) స్వాతంత్ర్య పోరాటంలో ప్రపథమంగా బ్రిటీష్ తూటాలకు నేల కొరిగిన కన్నెగంటి హనుమంతు పాఠ్యాంశాన్ని తొలగించడాన్ని ఆక్షేపించారు. మహాత్మా గాంధీకి సంబంధించిన కొన్ని అంశాలను పాఠ్యాంశాల్లో తొలగించడంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్షుణ్ణంగా ప్రతీ విషయాన్ని గమనించి ముందుకు సాగాల్సిన అవసరముందన్నారు. మొదటిరోజు సుమారు 40 మంది పిల్లలు సమ్మర్ క్యాంపుకు హాజరయ్యారు. డ్రాయింగ్, క్రాఫ్ట్, సైన్స్ సంగతులు, ఆడలాడుకుందాం, పాటలు పాడుకుందాం, కథలు చెప్పుకుందాం అనే అంశాలపై ఐదు రోజులు పాటు శిక్షణ జరగనుంది. మొదటి రోజు పద్మావతి టీచర్ నీతికథలు, దేశ నాయకుల జీవిత విశేషాలను వివరించారు. కోటేశ్వరరావు మాష్టారు సైన్స్ విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు ఆర్‌వి రాఘవయ్య, కొండల ప్రసాద్, తాడేపల్లి చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు వై.బర్నబస్ పాల్గొన్నారు.



వృద్ధుల సేవాశ్రమంలో నేత్ర పరీక్షా శిబిరం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి రామనాథం చినకోటయ్య శివపార్వతమ్మ వద్దుల సేవాశ్రమంలో ఆదివారం ఆశ్రమ అధ్యక్షులు రామనాథం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 96వ నేత్ర పరీక్ష శిబిరం జరిగింది.ఈ సందర్భంగా కళ్ళజోళ్ళు అవసరం ఉన్న 50 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఒబిసి మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ, రచయిత గోలి మధు, పిరమిడ్ ధ్యాన ప్రచారకుడు కొసనం శ్యామలరావు, గాయని రావుల అమృతాచారి తదితర స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



పేద విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి, కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. పట్టణంలోని డోలాస్‌నగర్‌కు చెందిన ఎస్.హిమబిందుకు రూ.9,500 అందజేశారు. హిమబిందు ఇంటర్ మొదటి సంవత్సరంలో 400 మార్కులు సాధించింది. ఆర్థిక పరిస్థితి అనుకూలించని పరిస్థితులు క్లబ్ దృష్టికి వెళ్లడంతో ఈ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధారి రామకృష్ణ, సభ్యులు జొన్నా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న తేళ్ల సుబ్బారావు

228 మందికి శుక్లాల ఆపరేషన్లు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

స్థానిక రోటరీ క్లబ్ వారు పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఆపరేషన్ల చేయించడం హర్షణీయమని చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు అన్నారు. ఆదివారం పెదనందిపాడు రోటరీ క్లబ్ వారు స్థానిక అశోక హైస్కూల్లో శంకర కంటి ఆసుపత్రి,జిల్లా అంధత్వ నివారణ సంస్థ దాత కొల్లా సాంబశివరావు ల సహకారంతో ఏర్పాటు చేసిన 22వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు పేదలకు అనేక విధాలుగా రోటరీ క్లబ్ వారు దాతలు సహకారాలతో ఉచిత శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించడం మంచి సంప్రదాయమని క్లబ్ సేవలను కొనియాడారు అనంతరం శిబిరములో డాక్టర్లు శృతి అగర్వాల్,డాక్టర్ దీక్షగుప్త డాక్టర్ విష్ణు ప్రియ లు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 228 మందికి శుక్లాలు ఆపరేషన్ చేసేందుకు నిర్ణయించారు వారికి మూడు విడతలుగా ఈ నెల 16,18,19వ తేదీలలో ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పి.నాగేశ్వరరావు, దాత కె.సాంబశివరావు, పి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నూలు వడికే రాట్నాలు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

పట్నంలోని రత్నాల చెరువులో ఆదివారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో నిరుపేద చేనేత 20 మంది మహిళలకు నూలువడికే రత్నాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమస్ సీఈవో సునీల్ కిలారు, టిడిపి నియోజక వర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, దామర్ల రాజు, షేక్ రియాజ్, కె.అంకమ్మరావు, పి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-మంగళగిరి

మాతృ దినోత్సవం సందర్భంగా మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం గాలిగోపురం వద్ద ఆదివారం శ్రీ పేద అనా ధల మాతృ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి, సిహెచ్ వెంకట నరసయ్య,ఉపాధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు, కార్యదర్శి పి.పూర్ణచంద్రరావు, కోశాధికారి వై. శివ నాగేశ్వరరావు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హనుమత్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-ఫిరంగిపురం

స్థానిక మండలంలోని బేతపూడిలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బత్తుల మహేష్ బాబు ఆధ్వర్యంలో అర్చకులు కె నరసింహాచార్యులు గ్రామ ఆలయ కమిటీ సభ్యులు ప్రజలు స్వామివారికి పూజలు నిర్వహించారు.

మధుర గాయకులు శరత్ బాబుకు సన్మానం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సినీ మాటలు రచయత బుర్రా సాయి మాధవ్ నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం, ఆదివారం ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై, నటించిన సినిమాలపై, ఆయన రాజకీయ జీవితంపై జరిగే సదస్సును కొత్తపేట పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం నిర్వహిం చారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సన్మానించే కార్యక్రమంలో భాగంగా ప్రముఖ మాన సిక వైద్యులు, మధుర గాయకులు ఐనంపూడి శరత్ బాబును ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి ఎన్టీఆర్ జ్ఞాపికను అందజేశారు. 'రాజకీయాల్లో అన్నగా ఎన్టీఆర్' అనే అంశంపై వక్తలు పుల్లేటికుర్తి ఎస్ వి శ్రీనుబాబు, తన్నీరు శివశంకర్ లు ప్రసం గించారు. అనంతరం వక్తలనూ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మా నిం చారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, మాదాల కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టిభాస్కర్, గుమ్మడిప్రసాద్, కంచర్ల ఏడుకొండలు, కంచర్ల నాగభూషణం, దంతాల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శరత్ బాబు, శ్రీనుబాబు, శివశంకర్ లను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రతిభగల విద్యార్థులకు'బాల్యమిత్ర' ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని తాలూకా హైస్కూల్ బ్రాంచ్ పూర్వ విద్యార్థులు పదోతరగతిలో సత్తా చాటిన మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. 1976-81 బ్యాచ్‌కు చెందిన పాఠశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన 'బాల్యమిత్ర తాలూకా హైస్కూల్ బ్రాంచ్' ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలను స్థానిక అతిధి హోటల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్చి 2023 పదోతరగతిలో పట్ట ణంలోని ఆరు మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఒకొక్కరికి రూ.1,116 చొప్పున ముఖ్యఅతిధిగా పాల్గొన్న అతిధి హోటల్ యజమాని అన్నవరపు సురేష్ చేతులమీదుగా నగదును అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు టి.శరత్ మాట్లాడుతూ బాల్యమిత్ర పేరిట ఏర్పాటైన అసోసియేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు కార్యక్రమం నిర్వహించామన్నారు. పారితోషకాలను అందుకున్న వారిలో కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు గద్దె శంకర రావు, ఏవి పాండురంగారావు, ఎ.ప్రసాద్ సత్య నారాయణమూర్తి, అరుణప్రసాద్, కేశవరావు, మురళి, భాస్కర్, సూరిబాబు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలను అందిస్తున్న టిజెహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

కోటప్పకొండపైకి కలెక్టర్ ట్రెక్కింగ్

పల్నాడు జిల్లాలో పర్యాటక అభివృద్ధి - సాహస క్రీడలకు ప్రోత్సాహం : జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి -నరసరావుపేట



పల్నాడు జిల్లాలోని అనేక పర్యాటక ప్రాంతాలతో పాటు నరస రావుపేటకు సమీపంలో ఉన్న కోటప్ప కొండను పర్యాటక స్థలంగా అభివృద్ధి చేసి సాహస క్రీడలు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన పర్యావరణ రహిత జీవనశైలి అనే కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఆది వారం యలమంద ఫారెస్ట్ పరిధిలోని కోటప్పకొండ అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అటవీశాఖ నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో సహా పాల్గొన్నారు. ప్రసిద్ధ శైవ క్షేత్రమైన త్రికోటేశ్వర సన్నిధి కోటప్పకొండ నుండి కుటుంబ సభ్యులతో కలిసి ట్రెక్కింగ్ చేసి కొండపైన ఉన్న పాత కోటయ్య స్వామి గుడి వరకు చేరుకొని తిరిగి కిందకి దిగి వచ్చారు. కార్య క్రమంలో వినుకొండ అటవీశాఖ అధికారి సయ్యద్ హుస్సేన్, వినుకొండ ఈస్ట్ సెక్షన్ మరియు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తంగేడుమల్లి సెక్షన్ ఆఫీసర్ టి.సీతారామయ్య, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భవానీదేవి, సోమేపల్లి వెంకటసుబ్బయ్య తదితరులు

ఎస్ఎం సుభాని సాహితీ సేవలు అభినందనీయం

'కాలంతో పాటు' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

రెండు దశాబ్దాలకు పైగా జిల్లా రచయితల సంఘంలో కార్యదర్శిగా, రచయితగా, కవిగా ఎస్ఎం సుభాని తన సాహిత్య రచనల ద్వారా కీర్తి గడించడం సాహిత్య లోకానికి గర్వ కారణమని ప్రముఖ రచయిత్రి డాక్టర్ చిల్లర భవానీ దేవి ప్రశంసించారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కార్యదర్శి, ప్రముఖ సాహితీవేత్త ఎస్ఎం సుభానీ రచించిన కవితా సంపుటి 'కాలంతో పాటు' పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని కొరటాల మీటింగ్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ భవానీదేవి మాట్లాడుతూ సుభాని వచన కవితలు సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నాయని చెప్పారు. సమకాలీన సమాజ సమస్యలపై తన కలాన్ని పదును పెట్టి కవిత జురులను అందించారన్నారు. గ్రంథ పాలకుడిగా వత్తిలో విశ్రాంత కాలాన్ని సాహిత్య రచనకు పూనుకొని సమాజాన్ని తట్టి లేపే విధంగా రచనలు చేయటం ఆయనలోని తపనకు నిదర్శనమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు గ్రహీత డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సుభాని కలం కాలానికి సాక్షిభూతంగా నిలుస్తుందన్నారు. కవితా సంపుటిలోని ప్రతి కవిత గుండెలను పిండుతూ హదయ ఘోషణను, ఆవేదనను, ఆర్ధతను ప్రతిబింబిస్తున్నాయని అన్నారు.కార్యక్రమంలో రమ్యభారతీ సంపాదకులు చలపాక ప్రకాష్, సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి గ్రంధ సమీక్ష చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా చిరకాలంగా సాహిత్య సేవల ద్వారా తనకు చేదోడు వాదోడుగా ఉన్న సుభాని నిజమైన సాహిత్య మిత్రుడని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ శుభాకాంక్షలు తెలియజేశారు.

మండుతున్న చిన్న కాగడ నుంచి పుష్పగుచ్ఛం

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో కుంచనపల్లి అరవింద హైస్కూల్లో జరుగుతున్న మ్యాజిక్ శిక్షణా శిబిరం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతుంది. ఆదివారమైనా పిల్లలు యధావిధిగా తరలివచ్చారు. పది రోజులు పూర్తి చేసుకున్న శిక్షణా శిబిరంలో ఆదివారం చిన్న కాగడ వెలిగించి అందులో నుంచి మ్యాజిక్ శిక్షణకు వచ్చిన అందరి చేత పూలగుచ్ఛం తెప్పించారు. తమ చేతిలో మండతున్న కాగడ నుంచి చూమ్ అనగానే పూలగుచ్ఛం రావడం పట్ల పిల్లలు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంద్రజాలకులు క్రాంతికార్ మాట్లాడుతూ ప్రతి మ్యాజిక్ వెనుక చిన్న లాజిక్ ఉంటుందని చెప్పారు. ఆ లాజిక్‌ను తెలివితేటలుగా పట్టుకోవడానికే ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిల్లలు శిక్షణలో చురుగ్గా ఉన్నారని అభినందించారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని కోరారు. ఈ నెల 18వ తేదీ విజయవాడ ఎంబివికెలో జరిగే మ్యాజిక్ ప్రదర్శనకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. 13 రోజుల పాటు పిల్లలు నేర్చుకున్న మ్యాజిక్‌ను వేదిక మీద ప్రదర్శిస్తారని చెప్పారు. శిక్షణ పొందిన పిల్లల తల్లిదండ్రులు, వారి బంధువులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మేజీషియన్ గాజుల పిచ్చయ్య, బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



జెడ్‌పి ఆదాయం పెంపునకు కృషి

టెన్తులో మెరుగైన ఫలితాలు -జడ్‌పి చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



జిల్లా పరిషత్‌కు ఆదాయం పెంపునకు తీవ్రంగా కృషి చేస్తున్నట్టు చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినాతెలిపారు. అభివృద్ధి పనులు, కార్యాలయాల నిర్వహణకు ఆదాయం పెంచాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా పరిషత్‌కు ఉన్న ఆస్తులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె వెల్లడించారు. టెన్త విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన స్టడీ మెటీరియల్, అల్పాహారం పంపిణీ ద్వారా గత ఏడాది కన్నా ఈ ఏడాది మెరుగైన ఫలితాలను సాధించామని తెలిపారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు వెల్లడించారు.

టెన్త విద్యార్థులకు అందించిన ప్రోత్సాహం?

జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా రంగ నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్ బాగా ఉపయోగపడింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ మెటీరియల్ పంపిణీచేశాం. అలాగే విద్యార్థులకు అల్పాహారం అందించాం. గతేడాది కన్నా ఈ ఏడాది 10 శాతం మంది అదనంగా ఉత్తీర్ణులయ్యారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో 59 శాతం మందిఉత్తీర్ణత సాధించారు.

ఆదాయం పెంపునకు ప్రణాళిక?

జిల్లా పరిషత్‌కు ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లు,నిధులతో పాటు స్వతంత్రంగా రావాల్సిన ఆదాయం పెంపునకు కృషి చేస్తున్నాం. బల్లకట్లు, బోట్లు, పడవుల నిర్వహణ, అతిథి గృహాలు, భూములు, స్థలాలకు ఉన్న ఆదాయవనరులను సమీక్షిస్తున్నాం. వీటిద్వారా ఆదాయం పెంపునకు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు.12 బల్లకట్ల ద్వారా ఆదాయం కోటి నుంచి కోటిన్నర వరకు వస్తుందని అంచనా వేస్తున్నాం. రీ ఆక్షన్ నిర్వహణ, అద్దెల పెంపు, పాత కాంట్రాక్టర్లను కొనసాగించినా గత ఏడాది కన్నా ఈఏడాది 33శాతం ఆదాయం పెంచాలని నిర్ణయించాం. తద్వారా వీటి ద్వారా ఆదాయం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం ఉన్నస్థలాల్లో పెట్రోలు బంకు, పలు దుకాణాలను నిర్మించాలని యోచిస్తున్నాం.

ఆస్తుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు?

జిల్లా పరిషత్ అధీనంలో పలు గ్రామాల్లో భూములు ఉన్నాయి. వాణిజ్య సముదాయాలు, అతిథిగృహాలు ద్వారా అద్దెల రూపంలో చాలా తక్కువగా ఆదాయం వస్తుంది. దీనిని



పెంపునకు కమిటీ వేశాం. ఈ కమిటీ ద్వారా భూములకు కౌలు, దుకాణాలకు ఉన్న అద్దెలు, అతిథి గృహాల నిర్వహణ ఛార్జీలను పెంచాలని నిర్ణయించాం. అలాగే ఎక్కడికక్కడ ఆస్తులను గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాం. ఆక్రమణలో ఉన్న ఆస్తుల స్వాధీనం కోసం చర్యలు చేపట్టాం.

చేపట్టిన అభివృద్ధి పనులు?

జిల్లా పరిషత్ సాధారణ నిధులతో గ్రామాల్లో అభివృద్ధిపనులు చేస్తున్నాం. వీటితో పాటు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లతో కూడా పలు పనులు చేపట్టాం.గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయం ఆధునీకీకరణకు రూ.11కోట్ల అంచనాతో రూపొందించిన పనులకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది.

గ్రామీణ పేదలకు న్యాయం పట్ల అవగాహన కల్పించాలి

హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ :గ్రామీణ ప్రాంత పేదలకు న్యాయం పట్ల, కనీస అవసరాల పట్ల వారికి అవగాహన కల్పించా ల్సిన బాధ్యత న్యాయ వాదులపైన ఉందని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. ఆదివారం వడ్డేశ్వరం లోని కెఎల్ విశ్వవిద్యాలయంలో ఎపి బార్ కౌన్సిల్ అధ్వర్యంలో రెసిడెన్షియల్ ఓరియంటేషన్ ప్రోగ్రాం పేరుతో ఏర్పాటు చేసిన మూడు రోజుల న్యాయవాదుల శిక్షణా శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలనతో ఆయన ప్రారంభించారు. ఎపి బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు సభాధ్యక్షత వహించారు. కెఎల్ విశ్వవిద్యాలయం చైర్మన్ కోనేరు సత్యన్నారాయణ, హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయ మూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా న్యాయవాదులనుద్దేశించి మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైనదని అన్నారు. న్యాయవాదవృత్తి లోకి నూతనంగా వచ్చిన వారికి చట్టంలోని కీలకమైన అంశాలతోపాటు కమ్యునికేషన్ స్కిల్స్ కూడా అవసరమన్నారు. దాని వలన అటు కక్షిదారుల నుండి సరైన సమయంలో సరైన సమాచారాన్ని రాబట్టుకుని పిటిషన్ తయారు చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కోర్టు గదిలో కూడా న్యాయవాదుల హావభావాలు చాలా కీలకమన్నారు. కొన్ని సమయాలలో న్యాయవాదులు తయారు చేసిన పిటిషన్లలో న్యాయం ఎంతమేర ఉందో న్యాయమూర్తులు చాలా త్వరగా పసిగట్టగలరని అన్నారు. కెఎల్ విశ్వవిద్యాలయం చైర్మన్ కోనేరు సత్యన్నారాయణ మాట్లాడుతూ సమాజంలో ఎంతో కీలకమైన వారు న్యాయవాదులు అని పేర్కొన్నారు. తమ విశ్వవిద్యాలయం తరుపున చేపట్టిన స్మార్ట్ విలేజ్



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

కార్యక్రమం ద్వారా ప్రతీ విద్యార్థి పదిహేను రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి గ్రామీణ పరిస్థితుల పైన అధ్యయనం చేసి గ్రామీణుల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి మాట్లాడుతూ న్యాయవాద వృత్తికి సమాజంలో ఎంతో గౌరవం ఉందని, న్యాయ వ్యవస్థలో న్యాయ వాదుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎపి బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత జరుగుతున్న ఓరియం టేషన్ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరగడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా న్యాయకళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో వర్సిటీ విసి డాక్టర్ జి పార్థసారథివర్మ, ప్రొఫెసర్ విసి డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.






హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయిని సత్కరిస్తున్న కెఎల్ యు చైర్మన్ కోనేరు సత్యన్నారాయణ, విసి , హాజరైన న్యాయవాదులు

104 ఉద్యోగుల యూనియన్ నూతన కమిటీ

జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా కె.సత్యరాజు, హైమావతి

ప్రజాశక్తి-గుంటూరు

104 ఉద్యోగుల యూనియన్ నూతన జిల్లా కమిటీ ఎన్నికైంది. సిఐటియు అనుబంధ 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా జనరల్‌బాడీ సమావేశం కె.సత్యరాజు అధ్యక్షతన ఆదివారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, ఎన్‌హెచ్ఎం జిల్లా జెఎసి సెక్రెటరీ జనరల్ విజయ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అరవిందో సంస్థ ద్వారా కాకుండా ప్రభుత్వమే నేరుగా 104 నిర్వహించాలని, ఉద్యోగులక పిఎఫ్, ఇఎస్ఐ రెగ్యులర్‌గా చెల్లించాలని, ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బి.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులుగా కె.సత్యరాజు జిల్లా ప్రధాన కార్యదర్శిగా హైమావతి, కోశాధికారిగా సాయిరాం తదితరుల్ని ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యరాజు